ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శనివారం 23 ఆగస్టు 2025



మెప్మా సీవో సరిత సస్పెన్షన్

ఆర్పీ, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ విధుల నుంచి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా సంఘాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ అనంతరం గజ్వేల్ మెప్మా సీవో (ప్రస్తుత దుబ్బాక సీవో) సరితను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇదే కేసులో మెప్మా ఆర్పీ టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలిని కూడా విధుల నుంచి తొలగిస్తూ గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. మెప్మా సంఘాల్లో జరిగిన నిధుల మళ్లింపు అంశంపై మార్చి 9న 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్పీల దారుణాలు' పేరిట కథనం ప్రచురితమవగా అప్పటి కలెక్టర్ మనుచౌదరి స్పందించారు. జిల్లా ఆడిటర్ జయశ్రీ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సుదీర్ఘంగా విచారణ జరిపిన అనంతరం కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దీని ఆధారంగా ప్రస్తుత కలెక్టర్ హైమావతి చర్యలకు ఉపక్రమించారు. నిధుల మళ్లింపు విషయంలో వారిపై ఆర్అండ్ఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవినీతి.. హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

సిద్దిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లంచం డిమాండ్ చేసిన సిద్దిపేట రూరల్ మండల హౌసింగ్ ఏఈ వెంకయ్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హైమావతి ఆదేశాలు జారీ చేశారు. వెంకటాపూర్ గ్రామంలో ఇళ్లు నిర్మిస్తున్న మేస్త్రీ చింతల వెంకటయ్య నుంచి ఏఈ వెంకయ్య డబ్బులు డిమాండ్ చేసినట్లు పత్రికల్లో వార్తలు రాగా, దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ జడ్పీ సీఈవో రమేష్‌ను విచారణకు ఆదేశించారు. వెంకటాపూర్ గ్రామపంచాయతీలో మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ఆయన విచారణ చేశారు. విచారణలో ఏఈ వెంకయ్యకు మేస్త్రీ రూ.5 వేలు ఇచ్చినట్లు తేలింది. ఈ నివేదిక ఆధారంగా వెంకయ్యను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి
ఆన్‌లైన్‌లోనూ అనుమతుల జారీ
డీజే వినియోగంపై నిషేధం 7

ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యం

ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్ 7

సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి సరఫరాపై

కలెక్టర్‌తో జగ్గారెడ్డి, నిర్మల సమీక్ష

- ఫిల్టర్ బెడ్ నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని సూచన
- గతంలో మంజీరా వాటర్ స్కీమ్‌ను తానే మంజూరు చేయించానన్న జగ్గారెడ్డి
- సమీక్షలో పాల్గొన్న అదనపు కలెక్టర్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులు



జిల్లా కలెక్టర్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి సరఫరా కోసం కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు సక్రమంగా ఫిల్టర్ కాకపోవడంతో కలుషితమవుతున్నాయన్నారు. ఫిల్టర్‌బెడ్ నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే బాగుంటుందని కలెక్టర్‌ను కోరారు. తాను ఎమ్మెల్యే కాకముందు సంగారెడ్డిలో లోతైన నల్లా గుంతల నుంచి నీరు తీసుకునేవారని గుర్తు చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా గెలవగానే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో పట్టణానికి మంజీర నీటి పథకాన్ని మంజూరు చేయించానన్నారు. తానే స్వయంగా డిజైన్ చేసి మంజీరా నీటి పథకాన్ని ప్రారంభించానని వివరించారు. ఫిల్టర్ బెడ్ నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలన్న ప్రతిపాదనను సమ్మతించిన కలెక్టర్ ఇందుకోసం ఏడాదికోసారి టెండర్లు పిలవాలని, నెలవారీగా చెల్లింపులు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాజంపేట నుంచి హస్టల్‌గడ్డ వరకు సీసీరోడ్డు, ఫిల్టర్‌బెడ్‌లో సీసీరోడ్డు, రెస్ట్‌రూమ్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. రూ. 500 కోట్లతో మహబూబ్‌సాగర్ సుందరీకరణ పనులకు ఫైనాన్స్ నుంచి అనుమతి వచ్చిందని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి వివరించారు. ఈ చెరువు సుందరీకరణ పనులపై హెచ్ఎండీఏ అధికారులతో సెప్టెంబర్ 2న కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.



సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, నిర్మల

యాంత్రీకరణకు అరకొర నిధులు



జిల్లాకు రూ.1.64 కోట్లు మంజూరు.. అందులో గతేడాది మిగులు నిధులే రూ.57.54 లక్షలు

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో ఈ పథకాన్ని పక్కన పెట్టిన ప్రభుత్వం, ప్రస్తుతం పునరుద్ధరించడం హర్షించదగిన విషయమే అయినప్పటికీ, కేటాయించిన నిధులు మాత్రం అరకొరగా ఉన్నాయి. ఈ నిధులతో ఏమేరకు రైతులను యాంత్రీకరణవైపు ప్రోత్సహిస్తారో చూడాలి.

వచ్చే నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ.. యంత్రాల పంపిణీ

పారదర్శకంగా అమలు చేయాలని కోరుతున్న రైతులు

గజ్వేల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఈ యాంత్రీకరణ పథకం కొనసాగినప్పటికీ 2018లో నిలిచిపోయింది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించింది. అయితే, గతేడాది సరైన ప్రణాళిక లేని కారణంగా ముదుకు సాగలేదు. ఈసారి పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. సిద్దిపేట జిల్లాకు మొత్తం రూ.1.64 కోట్లు మంజూరు చేసింది.

వ్యవసాయ డివిజన్ల వారీగా నిధులు కేటాయింపు

డివిజన్	నిధులు(రూ.లక్షల్లో)
సిద్దిపేట	21.15
హుస్నాబాద్	21.20
దుబ్బాక	19.04
గజ్వేల్	17.60
చేర్యాల	15.15
ములుగు	13.65



కానీ, ఇందులో గతేడాది యాంత్రీకరణకు సంబంధించి హడావిడిగా విడుదల చేసిన రూ.57.54 లక్షలు మినహాయించనున్నారు. దీంతో ఈ ఏడాది కేవలం రూ.1.07 కోట్లు మాత్రమే మంజూరు కానున్నాయి. ఆధునిక వ్యవసాయం వైపు ప్రోత్సహించాలంటే, ఈ నిధులు ఏ మాత్రం సరిపోవని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడు పరికరాలకే ప్రాధాన్యం

గతంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్ల వంటి పెద్ద యంత్రాలను కూడా పంపిణీ చేసిన ప్రభుత్వం, ఈసారి కేవలం మూడు రకాల యంత్రాలైన పవర్ స్ప్రేయర్లు, పవర్ కట్టర్లు, రోటోవేటర్లకు మాత్రమే నిధులను కేటాయించింది. ఇది కూడా ఆధునిక వ్యవసాయం వైపు రైతులు మళ్లేందుకు ప్రోత్సాహం లేనట్టేనని వాపోతున్నారు. సరైన స్థాయిలో నిధులు కేటాయించి ఉంటే యువ రైతులను ప్రోత్సహించేలా ఈ పథకం ఉండేదని చెబుతున్నారు.

కేటాయింపులు ఇలా...

జిల్లాకు కేటాయించిన బడ్జెట్‌లో 147 పవర్ స్ప్రేయర్లు, 38 పవర్ వీడర్లు/బ్రష్ కట్టర్లు, 160 రోటోవేటర్లను అందజేయనున్నారు. ఈ పథకం ద్వారా మిగతా 8లో

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దరఖాస్తులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు సరిపోలకపోవడం, అక్షర దోషాల కారణంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వందల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



దుబ్బాక మండలంలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇళ్లకు చెల్లింపుల కష్టాలు

ఆధార్ వివరాల్లో లోపాలతో లబ్ధిదారులకు ఇక్కట్లు
బిల్లు చెల్లింపు నిలిపివేత
ఆధార్ కేంద్రాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

సిద్దిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దరఖాస్తులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు సరిపోలకపోవడం, అక్షర దోషాల కారణంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వందల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పెండింగ్‌లో బిల్లులు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దాదాపు 2 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మొదటి విడతలో 2,658, రెండో విడతలో 9,807 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 12,465 ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. నిర్మాణ పనులు ప్రారంభించిన లబ్ధిదారుల్లో బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి రూ.లక్ష, గోడల లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్ లెవల్‌కు రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయితే రూ.లక్ష చొప్పున మొత్తం రూ.5 లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఇప్పటివరకు బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న 2,066 ఇళ్లకు రూ. 20.66 కోట్లు, గోడల లెవల్ పూర్తి చేసుకున్న 314 ఇళ్లకు రూ.3.14 కోట్లు, స్లాబ్ లెవల్‌కు చేరుకున్న 163 ఇళ్లకు రూ.3.26 కోట్లు చొప్పున మొత్తం రూ.27.06 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అయితే, ఆధార్‌తో పేరు సరిపోలని కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,100 మందికి పైగా బేస్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆధార్ అప్‌డేట్ సమస్య

దరఖాస్తు చేసుకునేటప్పుడు చాలా మంది లబ్ధిదారులు ఆధార్ కార్డులో ఉన్న పేరు మిగతా 8వ పేజీలో

అదే బారులు.. అవే బాధలు

యూరియా కోసం రైతుల అవస్థలు 7

మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో షార్ట్‌సర్క్యూట్

ముగ్గురికి గాయాలు.. మహ్మదాపూర్‌లో ఘటన 7

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పంచరాయితండాలో ఘటన 6

రైతులు అధైర్యపడొద్దు.. యూరియా కష్టాలు తీరుతాయి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



రాఘువాపూర్‌లో రైతులతో మాటాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట రూరల్/దుబ్బాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, రెండు మూడు రోజుల్లో సమస్య పూర్తిగా తీరుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. అయితే, ఈ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమే కారణమని ఆయన ఆరోపించారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా నారాయణరావుపేట మండలం శేఖర్‌రావుపేటలో నూతన గ్రామ పంచాయతీ భవనం మిగతా 8వ పేజీలో

ఒకే అంగన్‌వాడీకి రెండుసార్లు భూమిపూజ

8

మెట్ట ప్రాంతానికి గుండెకాయ గౌరవెల్లి

- త్వరలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం
- యూరియా కొరతకు కేంద్రమే కారణం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట/హుస్నాబాద్ రూరల్/కోహెడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మెట్ట ప్రాంతానికి గుండెకాయ అయిన గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించామని, పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మంత్రి శుక్రవారం అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా అక్కన్నపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులను చూసి ఆగి, వారికి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కావాలనే సరఫరా చేయకుండా రైతులకు ఇబ్బందులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీకి వెళ్లి విన్నవించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీలు, మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై ఎన్జీటీ విధించిన రూ.10 కోట్ల జరిమానాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు. మంత్రి తన పర్యటనలో భాగంగా హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మహ్మదాపూర్‌లో పంచాయతీ భవనాన్ని, ఉమ్మాపూర్‌లో అంగన్‌వాడీ భవనాన్ని, అలాగే కోహెడ మండలంలోని బస్వాపూర్, ఆరేపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించి, పలు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో రైతులతో మాట్లాడుతున్న పొన్నం

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే రక్షా కవచాలు
- సీపీ అనురాధ

హుస్నాబాద్/హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే ప్రధాన ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించి వారి మన్ననలను పొందాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ సూచించారు. శుక్రవారం ఆమె హుస్నాబాద్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించిన సీపీ, పోలీస్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీపీవోలు (విలేజ్ పోలీస్ ఆఫీసర్స్) తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు గ్రామాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఆమె హుస్నాబాద్ రూరల్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తితో కలిసి ప్రారంభించారు. గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు, నేరాలను అరికట్టడానికే సీసీ కెమెరాలే రక్షా కవచాలుగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



డెలివరీ సిస్టర్న్ ద్వారా మల్లన్నసాగర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోత

మల్లన్నసాగర్‌లోకి ఆరు పంపులతో ఎత్తిపోత

తొగుట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు మళ్లీ ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 11 టీఎంసీల నీరు నిల్వ ఉండగా శుక్రవారం ఆరు పంపుల ద్వారా ఎత్తిపోతలను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. కాగా ప్రతీరోజు 7,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి ఈ ఏడాది గరిష్ఠంగా 30 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్‌లో నిల్వ చేయనున్నట్లు డిప్యూటీ ఇంజనీర్ చెన్ను శ్రీనివాస్‌రావు తెలిపారు.





మహాలక్ష్మీ నమోస్తుతే!

శ్రావణమాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సిద్దిపేట గణేష్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 108 మంది మహిళలు ఏకకంఠంతో శ్రీమహాలక్ష్మి మూల మంత్రం పఠనం చేస్తూ శ్రీసూక్త హోమం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని వేంకటేశ్వరాలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారిని తీసుకొచ్చారు.

- సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

నకిలీ తేనె తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

గజ్వేల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ తేనెను తయారు చేస్తున్న వ్యక్తిని గజ్వేల్ పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌లోని ఈస్ట్ చంపారన్‌కు చెందిన మన్సూర్ ఆలం(33) ప్రజ్ఞాపూర్‌లోని ఒక ఇంటిని కిరాయికి తీసుకుని, నకిలీ తేనెను తయారు చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడులు నిర్వహించి 20 కిలోల మిక్సింగ్ తేనె, పటిక, చక్కెర, చిన్న గ్యాస్ సిలిండర్, స్టవ్, వడపోత వస్త్రం, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు గజ్వేల్ ఎస్సై రఘుపతి తెలిపారు.



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

5.402 కిలోల గంజాయి పట్టివేత



ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సంగారెడ్డిక్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ శివారులోని 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యజ్జల చిరంజీవి టాటా విస్టా కారులో ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి 5.402 కిలోల ఎండు గంజాయి, కారు, ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు హనుమంతు, అనుదీప్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పండరి, అరుణ జ్యోతి, సుభాష్, శివ, రాజేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.2.40లక్షల విలువ చేసే వివిధ రకాల మాదక ద్రవ్యాలను మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా అవుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి షహనవాజ్ ఖాసిం ఆదేశాల మేరకు మెదక్ సహాయ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి వద్ద ఎన్‌డీపీఎస్ పదార్థాలైన చరస్ 108 గ్రాములు, ఎండిఎంఏ 2.90 గ్రాములు, ఎల్ఎస్ డీ పేపర్స్ 10, బ్లాట్స్, కొకైన్ 3.01 గ్రాములు, ఎండీఎంఏ ఎక్టసీ మాత్రలు 44 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. ఈ పదార్థాలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐ యాదయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



భాస్కర్ (ఫైల్)

అక్కన్నపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పంచరాయి తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య ఈర్య-బుజ్జి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహమైంది. భూక్య భాస్కర్ (18) ఇటీవలే ఐటీఐ పూర్తి చేసి కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా కరీంనగర్‌లో స్తంభంపై వైర్లు సరిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడు. చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు.

రేగోడులో ఎద్దు ..

రేగోడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రేగోడులో రైతు నాగరాజు గౌడ్‌కు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి ఆత్మహత్య

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, పొలం గొడవలు తదితర కారణాలతో బలవన్మరణం పొందారు.



స్వామి, గంగమణి(ఫైల్)

నిజాంపేట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇరువురు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిజాంపేట ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... నందిగామ గ్రామానికి చెందిన ఎడపల్లి స్వామి (40)భార్య గీత డబ్బుల విషయంలో రెండేళ్ల క్రితం గొడవపడ్డారు. దీంతో భార్య రామాయంపేటలో పిల్లలతో కలిసి ఉంటుండగా.. అతను రంగనాయక సాగర్ డ్యాం చంద్లాపూర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పిల్లలపై బెంగతో మనస్థాపానికి గురై గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో దులానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల గంగమని (50) కుటుంబంలో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం కల్వకుంట శివారులోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడింది. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక..



ఆంజనేయులు (ఫైల్)

మాసాయిపేట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామం చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధతో ఉరివేకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ఆంజనేయులు(49) ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తెలియక బుధవారం ఉదయం పోతనపల్లి అటవీ ప్రాంతం సమీపంలోని తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయులు కుమారుడి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారంలో కార్మికుడు..

జిన్నారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో స్టోన్ క్రషర్ వద్ద పని చేసే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాధారం శివారులోని స్టోన్ క్రషర్ వద్ద పని చేసే కార్మికుడు సానీకుమార్ పానిక(24) గురువారం రాత్రి తాను పని చేసే స్టోన్ క్రషర్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన వాడు కాగా, ఏడాది క్రితం వివాహం జరిగింది. మృతుడి సోదరుడు సచిన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు ..



రాజేందర్(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన ఆకుల రాజేందర్ (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను రెండు రోజుల క్రితం తన భార్య పిల్లలను అత్తగారింటి వద్ద వదిలి తన స్వగ్రామం వచ్చి అదే రోజు వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాజేందర్ గతంలో ఫోటో స్టూడియోలో పనిచేసి, తర్వాత కారు కొని అప్పులు తీర్చలేక ట్యాక్సీ డ్రైవర్‌గా మారాడు. అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పురుగుల మందు తాగిన మహిళ..



యాదమ్మ(ఫైల్)

వర్గల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన పిట్ల యాదమ్మ (53) పురుగుల మందు సేవించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... యాదమ్మ, ఆమె కుమారుడు నరేష్ నివసించే ఇంటి సమీపంలో కొంత భూమి కొనుగోలు చేశారు. ఈ విషయంపై కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. గురువారం సాయంత్రం జరిగిన గొడవతో మనస్తాపం చెందిన యాదమ్మ బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందు సేవించింది. చికిత్స కోసం గజ్వేల్, ఆపై హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందింది. నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి



గాయపడిన షేక్‌బాబా

పటాన్‌చెరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో అన్నదమ్ములిద్దరూ గొడవ పడుతున్న సమయంలో తమ్ముడికి కత్తిపోట్లు పడి గాయపడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... రుద్రారం గ్రామానికి చెందిన షేక్ మదర్, షేక్ బాబా అన్నదమ్ములు. గురువారం రాత్రి కుటుంబ గొడవల నేపథ్యంలో తమ్ముడు షేక్ బాబాపై అన్న షేక్ మదర్ కత్తితో దాడి చేశాడు. ఛాతీ భాగంలో గాయాలు కావడంతో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. భార్య సమరీన్‌భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సిలిండర్‌కు మంటలు.. తప్పిన పెను ప్రమాదం



సిలిండర్‌లను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నారాయణఖేడ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయపల్లి రోడ్డు పక్కన ఉన్న ఒక టిఫిన్ సెంటర్‌లో శుక్రవారం సిలిండర్‌కు మంటలు అంటుకొని అగ్నిప్రమాదం జరిగింది. ఇవరాలు ఇలా ఉన్నాయి. ఉదయం పూట టిఫిన్ సెంటర్‌లో జనాలు టిఫిన్ చేస్తుండగా, వెనుక భాగంలో ఉన్న వంటగదిలో సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. గదిలో 10 వరకు సిలిండర్లు ఉన్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకొని ఒకవైపు మంటలను ఆర్పుతూనే మరోపక్క గదిలో ఉన్న సిలిండర్లను బయటకు తీసుకొచ్చారు. జాతీయ రహదారి పక్కన నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగింది.



పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్ఐ, సిబ్బంది

వారు నాటుతున్నారు.. వీరు నరుకుతున్నారు

పాపన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పోలీసులు మొక్కలు నాటుతుంటే, విద్యుత్ శాఖ మాత్రం కరెంటు అంతరాయం లేకుండా చెట్లను నరికివేస్తోంది. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతుంటే, విద్యుత్ శాఖ అధికారులు తీగల కింద పెరిగిన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి పడేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్ల మీదే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు మొక్కలు నాటుతుంటే, కొత్తపల్లి వద్ద విద్యుత్ అధికారులు చెట్లు నరికారు. ఇష్టమొచ్చినట్లు మొక్కలు నరకడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.



కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు నరికిన చెట్లు

మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో షార్ట్ సర్క్యూట్

● ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీకాంత్

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో ప్యానల్ బోర్డు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. బొల్లి పవన్, ఆపరేటర్ రాజేందర్‌లకు స్వల్ప గాయాలు కాగా, ఎడపెల్లి శ్రీకాంత్‌కు రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గత మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాంత్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పంప్‌హౌస్‌లో చాలా ఏళ్లుగా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రిడ్‌లో సమస్యలలను సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా, నిర్లక్ష్యం వహించడంతో సమస్య నేడు ప్రాణాపాయంగా మారిందని గ్రామస్థులు మండిపడ్డారు. సంఘటన స్థలాన్ని మిషన్‌భగీరథ సీఈఈ అమరేందర్, ఎస్ఈ రాంప్రసాద్, డీఈఈ శ్రీనివాస్, ఏఈ సాయికృష్ణ పరిశీలించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు స్పందించి బాధితులకు మెరుగైన వైద్యం అందించే బాధ్యత మాదని భరోసా ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

జాతీయ రహదారిపై అదుపు తప్పిన కారు

●త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపు తప్పి ఓ పక్కకు ఒరిగిన కారు

కంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మదీనాగూడ-సంగారెడ్డి 65వ జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు ఆటంకంగా మారాయి. ప్రమాదాల సూచికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దారి పొడవున రోజుకు ఒక ప్రమాదం జరుగుతునే ఉన్న హైవే అథారిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. శుక్రవారం కంది శివారులోని సంగమేశ్వర ఆలయం వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో సూచికల బోర్డు కనపడక హైదారాబాద్ నుంచి జహీరాబాద్‌కు వైపుకు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. బ్యాలెన్స్ తప్పి పక్కనే గుంతలో ఒరిగింది. ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయలవ్వగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వెంటనే హైవే అథారిటీ అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా ప్రమాదాల సూచికబోర్డులు ఏర్పాటు చేసి, రోడ్ల విస్తరణ పనులు జరపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థినులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో గురు, శుక్రవారాలలో 'సెలెస్టియా-2025' పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కొత్త విద్యార్థులకు మరపురాని ప్రారంభాన్నిచ్చిన ఈ వేడుకలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మిస్టర్ అండ్ మిసెస్ ఫ్రెషర్ కిరీట ధారణతో కార్యక్రమం ముగిసింది. వీరిని రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్యం క్యాంపస్ లైఫ్ విభాగం డైరెక్టర్ అంబికా ఫిలిప్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా చేరేవారు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, గీతం కమ్యూనిటీలో సభ్యులు కావడం అంటే, ఇంట్లో ఉన్నట్టుగా భావించేలా ఒక శక్తివంతమైన వేదికను సృష్టించడంలో విద్యార్థి నిర్వాహకులు చేసిన కృషిని ప్రశంసించారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

● రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి
● ఆన్‌లైన్ అనుమతుల జారీ
● నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
● డీజే వినియోగంపై నిషేధం

దౌల్తాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో, మండలాల్లో గణేశ్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంలగాణ పోలీసు శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

నిబంధనలివే..

- గణేశ్ మండప నిర్వాహకులు పోలీసు అనుమతి కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసు కోవాలి. గణేశ్ ప్రతిమ ఎత్తు, మండపం ప్రదేశం. నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలతో తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇంకా అవసరమైన అన్నీ వివరాలు పొందుపర్చాలి.
- రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆన్‌లైన్ అనుమతులు జారీ చేస్తారు. అనుమతి పత్రం, క్యూ ఆర్ కోడ్, పోలీస్ సూచనలు మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ప్రదర్శించాలి.
- డీజే వినియోగంపై నిషేధం ఉందని గమనించాలి.
- విద్యుత్ కనెక్షన్ సంబంధించి ఆ శాఖ అనుమతి తీసుకోవాలి.
- మండపం వద్ద ఫ్లెక్సీల్లో కమిటీ సభ్యుల పేర్లు, బాధ్యత వహించే వారి నంబర్లు ఉంచాలి.
- నిమజ్జన సమయంలో ప్రతి ప్రతిమకు సరిపడ మంది సభ్యులు వెంట ఉండాలి. నిబంధనలు పాటించాలి.
- శబ్ద కాలుష్యం నివారణలో భాగంగా కేవలం రెండు స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలి.
- వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద పరికరాలు పరిమితంగా వాడాలి.
- మండపంలో ప్రతీరోజు ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండాలి.
- అగ్నిప్రమాద నివారణ చర్యగా నీటి బకెట్లు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా ఉంచాలి.

మట్టి విగ్రహాలను వాడుదాం..

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపునిచ్చారు. ఆయనకు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉన్నదని, పర్యావరణ హితం కోసం హెల్పింగ్ హ్యాండ్ యూత్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అఖిల్, రాంజోష్, హనుమంత్ పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపు కోవాలి. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను నిర్వాహకులు పాటించాలి. చట్ట విరుద్ధంగా అధిక శబ్ద పరికరాలను వాడొద్దు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- అరుణ్ కుమార్, ఎస్ఐ, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర విజిలెన్స్ చీఫ్ ఉమారాణి



చింతమడకలో సిబ్బందిని సన్మానిస్తున్న ఉమారాణి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ చీఫ్ ఉమారాణి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పని చేసుకుంటూ వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పనులను మంజూరు చేయించుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జిల్లా అధికారి గణేశ్, జెడ్పీ సీఈవో రమేష్, ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో విష్ణు, పంచాయితీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మ దహనం



హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ పార్టీపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులు గత నెల రోజులుగా యూరియా కోసం ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ప్రాంతానికి సరిపడా యూరియా ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.

ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యం

● ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను పరిశీలిస్తున్న ఈడీ

గజ్వేల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని టీజీ ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిపో పరిధిలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం డిపోలోని సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం కృష్ణమూర్తి, డీఎం పవన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ బాబు నాయక్, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ జమీల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తునికిఖాల్సా పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

● ట్రైల్ బ్లేజర్స్ పుస్తకంలో చోటు



Speak - Learn - Grow:
Enhancing Education with AI

School Name : MPPS, Thunkikhalsa Wargal Mandal, Siddipet
School Head : V. Manjula
Contact No : 9666887522
Email Address :

Teaching is more than just a profession for me; it is a passion and a lifelong commitment. I am V Manjula, and I have been having the honour of serving primary school students as a Secondary Grade Teacher since 19th January 2002. Currently, I serve at MPPS Thunkikhalsa in Wargal Mandal, Siddipet District. My passion for teaching was ignited by the realisation that education can transform lives.

The Beginning of a Dream

Challenges that needed immediate attention:

ట్రైల్ బ్లేజర్స్ పుస్తకంలో ప్రచురితమైన ఉపాధ్యాయురాలు మంజులారెడ్డి

వర్గల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం తునికిఖాల్సా ప్రాథమిక పాఠశాలకు 2024-2025 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించిందని ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ రాథోడ్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రచురించే 'ట్రైల్ బ్లేజర్స్' అనే పుస్తకంలో 'ప్రొఫెషనల్ జర్నీ' అనే టైటిల్‌తో తమ పాఠశాలకు చోటు దక్కడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 51 పాఠశాలలను ఎంపిక చేశారని, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, కమ్యూనిటీ ప్రోత్సాహం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని ఆయన వివరించారు. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు వంగ మంజులారెడ్డి బోధన, బోధనేతర కార్యక్రమాలు, విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రోత్సహించిన తీరు, ఆమె జిల్లా రిసోర్స్ పర్సన్‌గా అందిస్తున్న సేవలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మంజులారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి రాజు, విమల, రుక్మిణి శ్రీనివాస్, జరీనా, ఫరాహ పాల్గొన్నారు.

నిజాంపూర్(కె) పాఠశాల ఉపాధ్యాయులకు చోటు..




రామకృష్ణ, సునీత

సంగారెడ్డి అర్బన్/సదాశివపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు లభించింది. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ, నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్(నీపా-న్యూఢిల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ లీడర్‌షిప్ అకాడమీపై ట్రైల్ బ్లేజర్స్ పేరుతో పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయురాలు సునీతలకు స్థానం దక్కింది. అకాడమిక్ డెవలప్‌మెంట్, ఎన్‌రోల్‌మెంట్ అండ్ అటెండెన్స్ విభాగంలో వీరు చోటు సంపాదించారు. ఎస్‌సీఈఆర్‌టీ ప్రచురించిన పుస్తకంలో తెలంగాణ నుంచి 51 మంది ఉపాధ్యాయులకు చోటు దక్కగా అందులో సంగారెడ్డి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం దక్కడం విశేషం. ఈ సందర్భంగా వీరిని డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎం, తదితర విద్యాశాఖ అధికారులు అభినందించారు.

సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీకి జాతీయ అవార్డు



రమ్య శ్రీ

కొండపాక, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీ నేషనల్ ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైనర్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో డిజైనెస్ట్ ఇంటీరియర్ ఫౌండెడ్ కంపెనీని స్థాపించిన రమ్యశ్రీ, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ విభాగంలో 'ట్రెండ్‌సెట్టర్, ప్రామిసింగ్ ఇంటీరియర్ డిజైనర్ ఫర్ ఆఫ్ ది ఇయర్- 2025 తెలంగాణ అవార్డుకు ఎంపికయ్యారు.

సూర్యప్రకాష్‌రావుకు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సూర్యప్రకాష్ రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో విశిష్ట నాయకత్వం విభాగంలో రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు-2025కి స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సూర్యప్రకాష్ రావు ఎంపికయ్యారు. విద్యారంగంలో గత 31 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించినందుకు గాను 'ఏక్ ఉపదేశ్ మీడియా' సంస్థ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డును హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపక బృందం, యాజమాన్యం అతడిని అభినందించింది. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని సూర్యప్రకాష్‌రావు తెలిపారు.

అదే బారులు.. అవే బాధలు

● యూరియా కోసం రైతుల అవస్థలు



సుల్తాన్‌పూర్ హకా సర్వీస్ కేంద్రంలో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్నలు తెల్లారింది మొదలు క్యూలలో నిలబడాల్సి వస్తోంది. దౌల్తాబాద్ మండలం రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. గత వారం రోజులుగా తిరుగుతున్నా యూరియా దొరకడం గగనంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం ఎదుట 560 బస్తాల కోసం సుమారు 2 వేల మంది రైతులు తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు. వ్యవసాయ అధికారి, ఎస్సై స్వయంగా దగ్గరుండి పంపిణీ చేయించారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో రైతులు యూరియా కోసం గంటల తరబడి లైన్లో నిలబడ్డారు. చౌటకూర్ మండలం సుల్తానాపూర్‌లో కేవలం గంటలోపే 280 యూరియా బస్తాలు పంపిణీ అయిపోయాయి. తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లలో నిలబడిన రైతులు బస్తాలు దక్కకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రం వద్ద రైతులు అర్ధరాత్రి నుంచే పడిగాపులు కాశారు. ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు తెలపడంతో రైతుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపు చేశారు.



దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం వద్ద బారులు తీరిన రైతులు

మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి తనిఖీలు..

రామాయంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి రామాయంపేటలోని ఒక ఫర్టిలైజర్ షాపుపై ఆకస్మిక దాడి చేసి, రైతులకు ఇవ్వకుండా దాచిన 50 యూరియా బస్తాలను పట్టుకున్నారు. వాటిని అక్కడి రైతులకు పంపిణీ చేయించారు. కొంతసేపు అక్కడే ఆందోళనకు దిగిన పద్మారెడ్డి, రైతులకు నేరుగా యూరియా ఇవ్వకుండా అవసరంలేని మందులు కొంటేనే బస్తాలు ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. యూరియా సమస్య పరిష్కరించకపోతే మరో మూడు రోజుల్లో రామాయంపేటలో 'వంటావార్పు'తో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ బాదే చంద్రం తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేటలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ధర్నా



నస్కల్‌లో ఎరువుల కోసం క్యూలో రైతులు

జోరుగా ఇసుక దందా

- రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

చిన్నకోడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. అక్రమార్కులు అదును చూసి ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలతో పాటు, కోహెడ, బెజ్జంకి మండలాల నుంచి ఇసుకను తరలిస్తూ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

వాహనాల డ్రైవర్లు మైనర్లే

ఇసుక వ్యాపారం లాభసాటిగా మారడంతో రాత్రి, పగలు తేడా లేకుండా జిల్లా, మండల సరిహద్దును దాటుకుని రోజుకు పదుల సంఖ్యలో ఇసుక వాహనాలు వస్తున్నాయి. ఇసుక తరలిస్తున్న వాహనాలను ఎక్కువగా మైనర్లే నడుపుతున్నారు. ఓవర్ స్పీడ్‌తో వస్తున్న ఇసుక వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలను మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న పట్టించుకునే నాథుడే లేడని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల శివారులో ఇసుక డంపులు

పలు గ్రామాల శివారు ప్రాంతాల్లో వ్యాపారులు ఇసుకను నిల్వ చేసి వాహనాలలో తరలిస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ శివారులో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కూడవెల్లి రామలింగేశ్వరాలయం చైర్మన్ ఊషయ్యగారి రాజిరెడ్డి



అదే భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు

ఒకే అంగన్‌వాడీకి రెండుసార్లు భూమిపూజ

దుబ్బాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో నేతల మధ్య ప్రొటోకాల్ వివాదాలు విచిత్రంగా మారాయి. ఒకే అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి రెండు వేర్వేరు పార్టీల నాయకులు రెండు సార్లు భూమిపూజ చేసి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అక్బర్‌పేట - భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో ఈజీఎస్ నిధుల కింద రూ.8 లక్షలతో అంగన్‌వాడీ భవనం మంజూరైంది. దీనికి అధికారికంగా భూమిపూజ చేయాలన్న తొందరలో, గురువారం కూడవెల్లి రామేశ్వరాలయం చైర్మన్, కాంగ్రెస్ నేత రాజిరెడ్డి భూమిపూజ చేసి, కొబ్బరికాయలు కొట్టించారు. శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కూడా అదే భవనానికి అధికారికంగా భూమిపూజ చేశారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ రిజ్వాన్ స్పందిస్తూ, గురువారం జరిగింది అనధికారిక భూమిపూజ అని, తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి మాత్రం ఎమ్మెల్యే, ఎంపీలకు సమాచారం ఇచ్చామని వివరించారు. ఒకే భవనానికి రెండుసార్లు భూమిపూజ జరగడంతో, మరోసారి ఎవరు వస్తారో? అంటూ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత జూన్ నెలలో సిద్దిపేట నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీలకు నిధులు కావాలని మంత్రి కొండ సురేఖ దష్టికి తీసుకెళ్తే రూ. 2.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులను ఇతర పార్టీల నాయకులు మంజూరు చేయించినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిపై ఆ పార్టీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దీన్, మార్క సతీష్, దాస అంజన్న, సాకి ఆనంద్, రియాజుద్దీన్, ముద్దం లక్ష్మి, అర్షద్, రాజబాహదూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

కొమురవెల్లి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని మండలంలో ఉన్న 12 మంది డీజే నిర్వాహకులకు పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించిన ఎస్సై రాజుగౌడ్ శుక్రవారం వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బైండోవర్ నిబంధనలను ఉల్లంగించి డీజే నిర్వాహకులు ఏవరైనా ఉత్సవాల్లో డీజేలను ఏర్పాటుచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణకు అరకొర నిధులు

(5వ పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు 50% సబ్సిడీ, ఇతర రైతులకు 40% సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నారు. మొత్తం నిధుల్లో మొత్తం నిధుల్లో ఎస్సీలకు రూ.18.32 లక్షలు, ఎస్టీలకు రూ.9.65 లక్షలు, ఇతరులకు రూ.79.77 లక్షలు కేటాయించారు.

వచ్చే నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఇటీవల జిల్లాలో యూరియా కొరత కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన యాంత్రీకరణ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మరో రెండు రోజుల్లో తిరిగి ప్రారంభించనున్నారు. 15 రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారు. ఎంపికైన రైతులకు వచ్చే నెలలో పనిముట్లను అందజేయనున్నారు. ఈ నిధులు అధికార పార్టీ నాయకులకే చేరకుండా, నిజమైన రైతులకు పారదర్శకంగా అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సెప్టెంబరులో పంపిణీ: డీఏవో స్వరూపరాణి

'ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా, రైతువేదికల్లో దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన రైతులను ఎంపిక చేస్తాం. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. వచ్చే నెలలో రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తాం.' అని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారిణి (డీఏవో) స్వరూపరాణి తెలిపారు.

నూతన ఆవిష్కరణలు రూపొందించాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేస్తూ ఉద్యోగం వచ్చేలా కష్టపడి చదివితే ఇంజనీరింగ్ విద్యతో మంచి భవిష్యత్ ఉంటుందని ఆక్విజేషన్ హెచ్ ఆర్ మేనేజర్ సుష్మ ఇందూర్ కళాశాల కరస్పాండెంట్ కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు సాంకేతికతతో కూడిన విద్యను అలవర్చుకోవాలని అన్నారు సర్టిఫికెట్ సాధించడమే కాకుండా ప్రతి సబ్జెక్టులో ప్రతిభను కనబరిచి ఉద్యోగం పొందేలా చదువుకోవాలని సూచించారు. కాలానికి అనుగుణంగా ఇంజనీరింగ్ కోర్స్ ఆర్ 25 సిలబస్‌లో మార్పులు జరిగాయని తెలిపారు. కళాశాలలో అన్ని వసతులను కల్పిస్తున్నామని, గ్రామీణ వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కళాశాల చైర్మన్ ప్రదీప్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం

- ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట క్రైం ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు కేంద్రప్రభుత్వం పరిహారం అందిస్తుందని దీని గురించి బాధితులకు తెలియజేయాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లాలోని అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో రోడ్డు ప్రమాదాలు, ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసులపై విస్తృతంగా చర్చించారు. హిట్ అండ్ రన్ ప్రమాదాలలో బాధితులకు కేంద్ర ప్రభుత్వం అందించే పరిహార పథకం గురించి వివరాలు ఎస్‌హెచ్‌ఓలకు అందజేశారు. అలాగే, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించారు.

మాజీ ఎంపీపీ ప్రథమ వర్ధంతిలో హరీశ్‌రావు

కొండపాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల శారద ప్రథమ వర్ధంతి శుక్రవారం కొండపాక లోని ఆమె స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఆయనతోపాటు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన అంకులుగారి నారాయణగౌడ్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి. రూ. 2 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, అన్నెబోయిన నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా చిలుముల శ్రీనివాస్

చేర్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా చిలుముల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా శుక్రవారం కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి విధుల లోకి చేరారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీవో మహబూబ్ అలీని ఇటీవల సస్పెండ్ చేయగా, ఆయన స్థానంలో రాయపోల్ మండల ఎంపీవోను చేర్యాలకు బదిలీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు చెల్లింపుల కష్టాలు

(5వ పేజీ తరువాయి)

కాకుండా రేషన్ కార్డు లేదా ఇతర పత్రాల్లో ఉన్న పేరును నమోదు చేశారు. మరికొందరు తమ మారుపేరును, ఇంటి పేరులో అక్షర దోషాలతో దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ఆధార్ ఆధారంగానే బిల్లులు చెల్లిస్తున్నందున, పేర్లు సరిపోలకపోవడంతో నిలిచిపోయాయి. ఈ సమస్యతో బాధపడుతున్న లబ్ధిదారులు తమ తప్పులను సరిదిద్దుకునేందుకు ఆధార్ కేంద్రాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. పదేళ్లు దాటిన ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, చాలా మంది పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, బ్యాంకుల్లో కేవైసీ అప్‌డేట్ లేకపోవడం, ఖాతాలు హోల్డ్‌లో ఉండటం కూడా మరో కారణంగా మారింది. అయితే, ఈ కారణాలు ఏవీ చూపకుండా తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

యం.శ్యాంసుందర్‌కు డాక్టరేట్ ప్రదానం

దుబ్బాక, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న రసాయన శాస్త్ర అధ్యాపకుడు యం. శ్యాంసుందర్‌కు డాక్టరేట్ లభించింది. సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బెంజాక్సజోల్స్ బెంజోథ యాజోల్స్ థయాజొలిడిన్ డయోన్స్ అండ్ బయోలాజికల్, డాకింగ్ స్టడీస్ ఆఫ్ థయాజొలిడిన్ డయోన్ మోయిటీపై పరిశోధనకు గీతం డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్శిటీ పర్యవేక్షకులు డాక్టర్ సి. హెచ్. సుధాకర్ ఆధ్వర్యంలో యం. శ్యాంసుందర్ చేసిన పరిశోధన ఫలితాలు రెండు ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనలు ప్రచురితమయ్యాయి.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



కోహెడలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోహెడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటల స్థితిగతులపై కోహెడ మండలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం పర్యటించారు. మండల వ్యవసాయ అధికారి సతీష్‌తో కలిసి మండలంలోని వరి, పత్తి, మొక్కజొన్న పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ పల్లవి, డాక్టర్ రమాదేవి, సరిత పరిశీలించారు. ఇందులో భాగంగా వరి పంట పిలక దశలో ఉన్నందున 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యురాట్ ఆఫ్ పోటాష్‌ను బురద పదునులో సమానంగా చల్లుకోవాలి అని వారు వివరించారు. వరి పంటలో గొట్టం రోగం గమనించినట్లైతే పిప్రోనిల్ ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే మొక్కజొన్న, ఇతర పంటలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు రాగుల తిరుపతి, మల్లేషం, వి రాజిరెడ్డి, ఏఈఓలు ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు.. యూరియా కష్టాలు తీరుతాయి

(5వ పేజీ తరువాయి)

పనులను, అక్బర్‌పేట - భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నిధులు మంజూరు చేసి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మెదక్ ఎంపీగా పదేళ్లు పనిచేసిన కొత్త ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి వచ్చాడా అని ప్రశ్నించాడు. వచ్చినా అదీ హరీశ్‌రావు కారు డోర్ తీయడానికి వచ్చిఉంటాడని ఎద్దేవా చేశాడు. ఎంపీ రఘునందన్‌రావు శేఖర్‌రావుపేటలోకి నడుచకుంటూ వస్తుండగా కాంగ్రెస్ నాయకులు బైఠాయించారు. వచ్చేది ఇక్కడికే, కింద ఎందుకు కూర్చోవడం అని ఎంపీ అనడంతో కాంగ్రెస్ నాయకులు లేచి యూరియా కొరత గురించి వివరించారు. దానికి ఎంపీ సానుకులంగా స్పందించి సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుందామని వారికి సూచించారు. అంతకు ముందు సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ రైతు ఆగ్రో సేవా కేంద్రంలో రైతులు యూరియా కోసం వేచిఉండడాన్ని చేసి వాహనం దిగి దుకాణంలోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. యూరియా సమస్యపై తనను కలిసిన కాంగ్రెస్ నాయకులకు, అలాగే రైతులతో మాట్లాడుతూ వారికి భరోసా ఇచ్చారు. యూరియా కొరత ఉందని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న ఆరోపణలు సిగ్గుచేటని అన్నారు. పాకిస్థాన్‌తో ఆపరేషన్ సింధూర్ కారణంగా చైనా నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రవాణా ఆలస్యమైందని, అందుకే ఈ ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. అయితే, ఈ అసౌకర్యానికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ చొరవతో సిద్దిపేటకు రైలు

చిన్నకోడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వే లైన్ అనేది ప్రజల ఎన్నో ఏళ్ల కళ అని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో సిద్దిపేట ప్రాంతానికి రైలు వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ పేర్కొన్నారు. చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి నిర్ణయంతీసుకోవడంతో శుక్రవారం చిన్నకోడూరులో బీఆర్ఎస్ నాయకులు బాణా సంచాలు కాల్చి, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

ఆల్ఫోర్స్‌లో పేరెంట్స్ కల్చరల్ జోష్

హుస్నాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌లో శుక్రవారం పేరెంట్స్ కల్చరల్ జోష్ కార్యక్రమం ఉత్సహంగా జరిగింది. దీనికి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు పిల్లల అభివృద్ధికి పాటుపడుతున్న తల్లిదండ్రులు కొన్ని చిన్న చిన్న ఆనందాలకు సైతం దూరం అవుతున్నారని, వారిలో మానసిక ఉల్లాసాన్ని పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.



విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల సహకారం

నంగునూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):నంగునూరులోని పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు శుక్రవారం తాగునీటి డిస్పెన్సర్ తో పాటు పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను అందించారు. 1984-85 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గత నెల 27వ తేదీన నలభై వసంతాల వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులకు పాద పూజ చేశారు. తమకు చదువు చెప్పి చనిపోయిన గురువులతో పాటు, తమతో చదువుకుని మరణించిన విద్యార్థుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. వారి జ్ఞాపకార్థం పాఠశాలకు మంచినీటి డిస్పెన్సర్‌ను పాఠశాలకు తీసుకెళ్లి అందించారు. పాఠశాల గ్రంథాలయానికి ఆక్స్‌ఫోర్డ్ అడ్వాన్స్ డిక్షనరీ, శంకరనారాయణ డిక్షనరీలు, ఇంగ్లీష్, హిందీ, తెలుగు త్రిభాషా డిక్షనరీలను అందించారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుకుందాం

నంగునూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతల్లో మార్పు తెచ్చేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట రూరల్ సీఐ శీను అన్నారు. నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో శుక్రవారం యువత ను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు.పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చే కార్యక్రమంలో భాగంగా యువతలో డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు గ్రామీణ యువతలో మార్పు కోసం క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉద్యోగుల జంగ్ సైరన్‌ను విజయవంతం చేయాలి



టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కొమ్మడ్ల విక్రమ్ రెడ్డి

సిద్దిపేట క్రైం, ఆగస్ట్ 22 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్ కళాతోరణంలో ఏర్పాటుచేసిన ఉద్యోగుల జంగ్ సైరన్ కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కొమ్మడ్ల విక్రమ్ రెడ్డి కోరారు. శుక్రవారం సిద్దిపేట టీఎన్జీవో యూనిట్, కలెక్టరేట్ యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగస్తుల కాంట్రిబ్యూటీ పెన్షన్ స్కీమ్ తొలగించి పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు రాష్ట్ర అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినటువంటి పాత పెన్షన్ విధానాన్ని పునాది చేస్తామని చెప్పి, దానికి అనుగుణంగా కూడా అడుగులు వేయడం లేదని ప్రతి సమస్యకు ఒక కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తుందని దీని ద్వారా ఉద్యోగులలో నిరాశ నిస్పృహలు ఉన్నాయని తెలిపారు.

టైలరింగ్‌తో ఆర్థిక భరోసా

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లులకు సుమారు 30 మందికి ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించడానికి ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు కూడా అందించడం జరిగిందని జిల్లా విద్యా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రమేష్ తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం వెల్కటూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా, కళలు, ఆరోగ్యం అంశాల పైన అవగాహన కల్పిస్తూ సేవలను అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా తల్లులకు కూడా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కలవేని శ్రీనివాస్ మాట్లాడుతూ .. తమ ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. భవిష్యత్తులో మరి కొంతమందికి శిక్షణ అందిస్తామని తెలిపారు.

వ్యవసాయ యాంత్రీకరణ ఎంతో అవసరం

సిద్దిపేట కలెక్టరేట్ ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ యాంత్రీకరణ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉపమిషన్ పథకం ద్వారా రూ.1.078 కోట్లను బడ్జెట్‌ను కేటాయించిందని, మహిళా రైతులకు, ఎస్సి, ఎస్టీ రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీతో రోటోవేటర్లు, పవర్ స్ప్రేయర్లు, బ్రష్‌కట్టర్లు అందజేయడం జరుగుతుందని, తమ మండల వ్యవసాయాధికారిని సంప్రదించి వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

గ్రామీణ చేతివృత్తులకు అన్యాయం

మర్కుక్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వడ్రంగులు, కంసాళ్లు, మొబైల్ షాపులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకునేటువంటి చేతివృత్తిదారులపై మార్వాడీల వల్ల అన్యాయం జరుగుతుందని జిల్లా స్వర్ణకార సంఘం నాయకుడు అరవిందచారి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మర్కుక్ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్వాడీలు గ్రామాల్లోకి వచ్చి అధిక ధరలకు దుకాణాలు ప్రారంభించడం వల్ల స్థానిక చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే అనేక మార్వాడీ షాపులు ప్రారంభం కావడంతో వైశ్యులు, ఇతర చిన్న వ్యాపారులు తమ జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. స్థానిక చేతివృత్తిదారులను రక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అరవిందచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్వాడీ గో బ్యాక్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జానపదం జాతిసంపద



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, జాతీయ సేవాపథకం, భాషాసంస్కృతిక విభాగం సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత మాట్లాడుతూ జానపద సాహిత్యం, కళలు, సంప్రదాయాలు జాతిసంపద, వాటిని కాపాడుకోవడం మన విధ్యుక్తధర్మం అని అన్నారు. సర్వకాలుగా కాలుష్యరహిత ప్రపంచానికి జానపదుల జీవనశైలి ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యావత్ ప్రపంచంలోనే మన తెలంగాణ ముఖ్యమైన జానపద కేంద్రస్థానాలలో ఒకటని, ఈ ప్రాంతపు జానపద తత్త్వం, ఆటలు పాటలు కథలు కళలు పండుగలు ఆహారనియమాలు జీవనవికాసం, ప్రాకృతిక సమన్వయధోరణి, మానవీయగుణం వీటన్నిటికి మూలకణం మన జానపదసుగుణమని అన్నారు. దీన్ని అవగతం చేసుకుని నడుచుకోవాలని సూచించారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా కరువు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ పైన వైద్య శాఖ అధికారుల నిఘా కరువైందని, విచ్చల విడిగా లాభార్జన ధ్యేయంగా హాస్పిటల్స్ నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్, అరవింద్, దాసరి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్‌కు ఆర్ఎంపీలు రెఫర్ చేయడంతో వచ్చిన పేషెంట్స్‌కు అవసరం లేని పరీక్షలను నిర్వహిస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. అనవసరమైన ఆపరేషన్‌లు చేసి సామాన్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారి పైన వైద్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనేక హాస్పిటల్స్‌లలో వైద్యం వికటించి ప్రాణాలు కోల్పోతున్న పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని, ఎలాంటి పార్కింగ్ స్థలం లేకుండా ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ అయితే ఫైర్ ఇంజన్ కూడా వచ్చే పరిస్థితి లేకుండా హాస్పిటల్స్ ఉన్నాయని అన్నారు. వైద్య అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

చేర్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):సేవ్ హైదరాబాద్ పేరిట బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సచివాలయ ముట్టడికి తరలివెళ్లకుండా చేర్యాలలో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు వ డ్లకొండ సంజీవులు, పట్టణాధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డిలను అరెస్ట్‌చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో హైదరాబాదు అధ్వానంగా మారిందని, అక్రమ అరెస్టులు చేసినా హైదరాబాద్ బ్రాండ్ పరిరక్షణకు పోరాడతామన్నారు.